# వయోవిభాగం : 8-10

## పోటీ విభాగం 3 - భాగవత పద్యాలు (చిన్నవి)

1. ***చేతులారంగ శివునిఁ బూజింపఁడేని,***
***నోరు నొవ్వంగ హరికీర్తి నుడువఁడేని,***
***దయయు సత్యంబు లోనుగాఁ దలఁపఁడేనిఁ,***
***గలుగ నేటికిఁ దల్లుల కడుపుఁ జేటు.***

భావము:
ఈ లోకంలో జన్మించిన ప్రతి ఒక్కడు చేతులారా శివుణ్ణి పూజించాలి, నోరారా కేశవుణ్ణి కీర్తించాలి, సత్యం కరుణ మొదలైన సద్గుణాలను అలవర్చుకోవాలి. అలా చేయని నిర్భాగ్యుడు ఈ లోకంలో పుట్టటం దేనికి తల్లి కడుపు చెడగొట్టటం దేనికి

2. ***పలికెడిది భాగవత మఁట,***
***పలికించెడివాడు రామభద్రుం డఁట, నేఁ***
***బలికిన భవహర మగునఁట,***
***పలికెద, వేఱొండు గాథ బలుకఁగ నేలా?***

భావము:
వ్రాయబడేదేమో పరమ పవిత్రమైన శ్రీమద్భాగవతం. కరుణా సముద్రుడైన శ్రీరామచంద్రప్రభువేమో వ్రాయించేవాడుట. వ్రాసి నందువల్ల భవభంధాలు పరిహారము అవుతాయిట. అంచేత భాగవతాన్ని వ్రాస్తాను. మిగతా వేవి వ్రాయను.

3. ***కలఁ డందురు దీనుల యెడఁ,***
***గలఁ డందురు పరమయోగి గణముల పాలం,***
***గలఁ డందు రన్ని దిశలను,***
***గలఁడు కలం డనెడి వాఁడు గలఁడో లేఁడో?***

భావము:
దేవుడు ఆర్తులైన వారి వెంట, ఉత్తమయోగుల చెంత, అన్ని దిక్కులలో ఉంటాడంటారు. "ఉన్నాడు, ఉన్నాడు" అనే ఆ దేవుడు మరి ఉన్నాడో! లేడో!

విశేషము- అర్థం చెప్పనక్కరలేని సులువైన పదాలలోని ఈ ప్రార్థన ఒక అమృత గుళిక. అలంకారం యమకం, 'కలడ' అంటూ ప్రాస ప్రక్క అక్షరానికి కూడా పాకింది. ఇక ఓపిక సన్నగిలింది, ఇంకో దిక్కులేదు. ఓపక్క ఉన్నాడు ఉన్నాడు అంటూనే,. ఆయన కాపాడటానికి రావటంలేదు కనుక సందేహం వస్తోందిట.

4. ***అడిగెద నని కడువడిఁ జను;***
***నడిగినఁ దను మగుడ నుడుగఁ డని నడ యుడుగున్;***
***వెడవెడ సిడిముడి తడఁబడ***
***నడు గిడు; నడుగిడదు జడిమ నడు గిడునెడలన్.***

భావము:
పద్యం నడకలోనే తడబాటును రకరకాలుగా చూపిన బహు చక్కని ఆణిముత్యమిది.
అప్పుడు లక్ష్మీదేవి భర్తను అడుగుదామని వేగంగా అడుగులు వేసేది. అడిగితే మారు పలుకడేమో అని అడుగుల వేగం తగ్గించేది. చీకాకుతో తొట్రుపాటుతో అడుగులు వేసేది. మళ్ళీ ఆగేది. అడుగులు కదిలించలేక తడబాటుతో నడిచేది.

5. ***భాగవతము దెలిసి పలుకుట చిత్రంబు,***
***శూలికైనఁ దమ్మి చూలికైన,***
***విబుధజనుల వలన విన్నంత, కన్నంత,***
***దెలియ వచ్చినంత, దేటపఱతు.***

భావము:
అయితే చిత్రమేమంటే భాగవతాన్ని చక్కగా సమగ్రంగా అర్థం చేసుకున్నాం అని ఎవరు చెప్పలేరు. ఆఖరికి ఆ త్రిశూలధారి పరమశివుడైనా సరే, పద్మభవుడైన బ్రహ్మదేవుడైనా సరే అలా అనలేరంటే ఇక నా సంగతి వేరే చెప్పాలా. అయినా పెద్దల వల్ల ఎంత విన్నానో, వారి సన్నిధిలో ఎంత నేర్చుకున్నానో, స్వయంగా ఎంత తెలుసుకోగలిగానో అదంతా తేటతెల్ల మయ్యేలా చెప్తాను.

6. ***కావున, సర్వాత్మకుఁడు, మ***
***హావిభవుఁడు, విష్ణుఁ, డీశుఁ డాకర్ణింపన్,***
***సేవింపను, వర్ణింపను,***
***భావింపను భావ్యుఁ డభవభాజికి నధిపా!***

భావము:
కనుక, రాజేంద్రా! మోక్షమార్గంలో పయనించే వాడికి సర్వజీవరాశికి ఆత్మయైన వాడు, మహావైభవం కలవాడు, జగదీశ్వరుడు అయిన విష్ణువే స్మరించడానికి, సేవించడానికీ, కీర్తించడానికీ, తెలుసుకోడానికీ తగినవాడు.

7. ***శ్రీమహిత వినుత దివిజ***
***స్తోమ! యశస్సీమ! రాజసోమ! సుమేరు***
***స్థేమ! వినిర్జితభార్గవ***
***రామ! దశాననవిరామ! రఘుకులరామా!***

భావము:
శ్రీరామా! శ్రీకరమైన మహిమ కలవాడా! దేవతలుచే సంస్తుతింపబడు వాడా! దిగ్దిగంతాల వరకు వ్యాపించే యశస్సు కలవాడా! చంద్రుని వలె చల్లని పరిపాలన చేయువాడా! మేరునగ ధీరుడా! పరశురాము డంతటి వాని భంగపరచిన శూరుడా! పది తలల రావణాసురుని తుదముట్టించిన వీరాధివీరుడా! రఘువంశోద్ధారక రామా! . . . అవధరించు.

***8. కాళికి బహుసన్నుత లో***
***కాళికిఁ గమనీయ వలయ కరకీలిత కం***
***కాళికిఁ దాపస మానస***
***కేళికి వందనము చేసి కీర్తింతు మదిన్.***

భావము:
లోకాలన్నిటి చేత పొగడబడేది, అందమైన కంకణాలు కలిగిన చేతిలో కపాలాన్ని ధరించేదీ. మునుల మనస్సులలో విహరించేది అయిన కాళీమాతను నా మనస్సులో కీర్తిస్తాను.

***9. శ్రీపతికి మత్పతికి నుత***
***గోపతికిఁ ద్రిలోకపతికి గురుజనబుధ సం***
***తాప నివారణ మతికిని***
***బ్రాపితసనకాది తతికి బహుతర ధృతికిన్,***

భావము:
లక్ష్మీదేవికి పతి అయినవాడు, నాకు ఈశ్వరుడైనవాడు, ఇంద్రునిచేత నుతింపబడినవాడు, ముల్లోకాలకు అధిపతి అయినవాడు, గొప్పవారైన పండితుల సంతాపాన్ని నివారించేవాడు, సనక సనందాది మహర్షులకు ఆశ్రయమైనవాడు, గొప్ప ధీరుడు అయిన శ్రీకృష్ణునికి...

***10. ప్రకట మకర వరుణ పాశంబు లందును***
***జలములందు నెందుఁ బొలియ కుండఁ***
***గాచుఁగాక నన్ను ఘనుఁడొక్కఁ డై నట్టి***
***మత్స్యమూర్తి విద్యమానకీర్తి.***

భావము:
ప్రళయకాలంలో తానొక్కడే మిగిలి కీర్తితో ప్రకాశించే మత్స్యావతార మూర్తి అయిన మహానుభావుడు నన్ను వరుణ పాశాలలో పడకుండా జలాలలో రక్షించునుగాక!

***11. చిత్రంబులు త్రైలోక్య ప***
***విత్రంబులు భవలతా లవిత్రంబులు స***
***న్మిత్రంబులు మునిజన వన***
***చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్.***

భావము:
విష్ణుకథలు బహు చిత్రమైనవి. చక్కటి చిత్రాలలా మనసులను రంజింపజేసేవి. ముల్లోకాలకు పవిత్రతను ఇచ్చేవి. కొడవళ్ళు తీగెలను కత్తిరించినంత అవలీలగా సంసార బంధాలను ఛేదించేవి. అఖిల జీవరాశికి ఆప్తమిత్రాలైనవి. వనాలను వసంతాలు వికసింపజేసి నట్లు, మునులను అలరింపజేసేవి.

***12. "చదివించిరి నను గురువులు<br>చదివితి ధర్మార్థ ముఖ్య శాస్త్రంబులు నేఁ<br>జదివినవి గలవు పెక్కులు<br>చదువులలో మర్మ మెల్లఁ జదివితిఁ దండ్రీ!***

భావము:
"నాన్నగారు! నన్ను గురువులు చక్కగా చదివించారు. ధర్మశాస్త్రం, అర్థశాస్త్రం మున్నగు ముఖ్య శాస్త్రములు అన్నీ చదివి, అన్ని చదువులలోని సారమూ, రహస్యమూ సంపూర్ణంగా గ్రహించాను.

SiliconAndhra
The Spirit of Telugu Literature, Culture and Tradition
సిలికానాంధ్ర